బీసీలే బ్యాక్‌బోన్

- మైలవరం నియోజకవర్గంలో లక్షా ఇరవై వేలకుపైగా బీసీ ఓటర్లు
- ఆరున్నర దశాబ్దాలుగా బీసీలను ఓటు బ్యాంకుగానే చూసిన రాజకీయ పార్టీలు
- రెండు సార్లు బీసీలకు సీటు కేటాయించిన వైఎస్సార్ సీపీ



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘాల ప్రతినిధులు, సభ్యులు (ఫైల్)

జి.కొండూరు: మైలవరం నియోజకవర్గంలో బీసీ ఓటర్లు అత్యధికంగా ఉన్నారు. ఈ నియోజకవర్గం 1952లో ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు 14 సార్లు శాసన సభ ఎన్నికలు జరిగాయి. అత్యధికంగా ఉన్న బీసీ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లను వైఎస్సార్ సీపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంకుగానే పరిగణించాయి. కేవలం 11 శాతం మాత్రమే ఓటర్లు ఉన్న ఒకే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులే 14 సార్లు నియోజకవర్గ ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. నియోజకవర్గంలో బీసీ ఓటర్లు అధికంగా ఉన్నప్పటికీ వారి బలాన్ని వారు గ్రహించకపోవడంతో పాటు బీసీ అభ్యర్థులకు వైఎస్సార్ సీపీ మినహా ఏ రాజకీయ పార్టీ కూడా అవకాశం కల్పించకపోవడంతో మైలవరం నియోజకవర్గం ఒక సామాజిక వర్గానికే కంచుకోటగా మారిందని రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

బీసీ ఓటర్లే అధికం

మైలవరం నియోజకవర్గంలో ప్రస్తుత లెక్కల ప్రకారం 2,76,409 మంది ఓటర్లు ఉండగా అందులో ఒక లక్షా 20 వేలకు పైగా ఓటర్లతో 44 శాతం ఓటు బ్యాంకు బీసీల సొంతం. అయినప్పటికీ ప్రతి శాసనసభ ఎన్నికల్లో వారిని ఓటు బ్యాంకుగానే వాడుకున్నారు. బీసీల ప్రాధాన్యతను గుర్తించిన వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2014, 2024 రెండు సార్లు బీసీ అభ్యర్థులకే వైఎస్సార్ సీపీ సీటును కేటాయించారు.



సర్నాల తిరుపతి రావు, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి

బీసీలకు వెన్నుపోటు

మైలవరం నియోజకవర్గంలో బీసీల ప్రాధాన్యతను గుర్తించిన వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2014లో బీసీ గౌడ సామాజిక వర్గానికి చెందిన జోగి రమేష్‌ను అప్పటి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ప్రకటించారు. అయితే అప్పటి వరకు వైఎస్సార్ సీపీలో కొనసాగిన బొమ్మసాని సుబ్బారావు వైఎస్సార్ సీపీ సీటు తనకు దక్కలేదన్న కోపంతో పాటు అప్పటి ప్రత్యర్థి టీడీపీ అభ్యర్థి దేవినేని ఉమామహేశ్వరరావు కుట్ర రాజకీయాలు కూడా తోడవడంతో సుబ్బారావు స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగి 11 వేలకు పైగా ఓట్లను చీల్చుకోవడంతో జోగి రమేష్ ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ బీసీలకు రాజ్యాధికారం అందించడమే లక్ష్యంగా మరోసారి త్వరలో జరుగనున్న శాసనసభ ఎన్నికలకు వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన అతి సామాన్య రైతు కుటుంబానికి చెందిన సర్నాల తిరుపతిరావును ప్రకటించి ప్రతిపక్ష పార్టీలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సవాలు విసిరారు.

స్పందించని టీడీపీ బీసీ నాయకులు

మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా బీసీ యాదవ కులానికి చెందిన సామాన్యుడు సర్నాల తిరుపతిరావును ప్రకటించిన తర్వాత కూడా టీడీపీ బీసీ నాయకులలో ఎటువంటి కదలిక రాలేదు. టీడీపీ సీటును బీసీలకు కేటాయించాలని అదిష్టానాన్ని అడిగే ప్రయత్నం కూడా చేయలేదు. దీనితో వైఎస్సార్ సీపీకి వెన్నుపోటు పొడిచి టీడీపీలో చేరిన వసంత వెంకట కృష్ణప్రసాద్‌కే మైలవరం సీటును కేటాయించేందుకు టీడీపీ అధిష్టానం మొగ్గు చూపింది.

బీసీలకు కీలక సమయం

త్వరలో జరుగనున్న శాసన సభ ఎన్నికల్లో మైలవరం నియోజకవర్గంలోని బీసీ ఓటర్లంతా గత తప్పిదాలను అనుభవంగా భావించి రాజకీయాలకతీతంగా ఏకమవ్వాల్సిన సమయం ఆసన్నమైందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. 2014లో చేజార్చుకున్న రాజ్యాధికారం సాధించుకునే అవకాశం మరోసారి రావడంతో బీసీ ఓటర్లంతా ఏకమైతే వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న సర్నాల తిరుపతిరావు విజయం నల్లేరుమీద నడకే అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మైలవరం నియోజకవర్గంలో బీసీ ఓటర్లతో పాటు 90 వేలకు పైగా ఓటర్లతో 33 శాతం ఓటు బ్యాంకు ఉన్న ఓసీలు, 50 వేలకు పైగా ఓటర్లతో 19 శాతం ఓటు బ్యాంకు ఉన్న ఎస్సీలు, 15 వేలకు పైగా ఓటర్లతో 5 శాతం ఓటు బ్యాంకు ఉన్న ఎస్టీలు సైతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై సానుకూలంగా ఉండడంతో త్వరలో జరుగనున్న శాసన సభ ఎన్నికల్లో మైలవరం నియోజకవర్గ ఆరున్నర దశాబ్దాల రాజకీయ చరిత్రను వైఎస్సార్ సీపీ తిరగరాస్తుందని రాజకీయ పండితులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

సంక్షేమ పథకాలతో అందరికీ లబ్ధి

నల్లగట్ల సుధారాణి



తిరువూరు 8వ వార్డులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సుధారాణి, నాయకులు

తిరువూరు: రాష్ట్రంలో గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో అన్ని కుటుంబాలూ లబ్ధి పొందాయని ఉమ్మడి కృష్ణా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి అన్నారు. తిరువూరు పట్టణంలోని 8వ వార్డులో గురువారం నేను సిద్ధం నా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమైన తిరువూరులో 90 శాతం కుటుంబాలకు అన్ని సంక్షేమ పథకాలూ అందాయని, రాజకీయాలకతీతంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలతో ప్రయోజనం పొందారని చెప్పారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తిరువూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న నల్లగట్ల స్వామిదాసును అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వార్డు కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, తంగిరాల వెంకటరెడ్డి, పసుపులేటి శేఖర్‌బాబు, మోదుగు ప్రసాద్, ఏరువ ప్రకాష్‌రెడ్డి, పరసా సత్యనారాయణ, నాయకులు కాలసాని విజయలక్ష్మి, బాలకృష్ణ, రామారావు, గజ్జల సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వెల్వడంలో ఇఫ్తార్ విందు



వెల్వడం(మైలవరం): రంజాన్ పండుగ ముస్లింల ఇళ్లలో ఆనందం నింపుతుందని వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ సొసైటీ అధ్యక్షుడు తోట తిరుపతిరావు అన్నారు. వెల్వడం గ్రామంలోని తోట తిరుపతిరావు నివాసంలో బుధవారం రాత్రి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ఇబ్రహీంపట్నం: తహసీల్దార్ కార్యాలయం వద్ద గ్రామ రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ రాజు గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవగా భావించి చలివేంద్రం ఏర్పాటు చేసిన వీఆర్వోలను అభినందించారు. వారంలో మూడు రోజులు మజ్జిగ, మిగిలిన రోజులు మంచినీరు అందుబాటు ఉంటుందన్నారు. డెప్యూటీ తహసీల్దార్ మహేష్ బాబు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్య, ఉపాధిపై అవగాహన

ఇబ్రహీంపట్నం: పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులకు ఆ తర్వాత విద్య, ఉపాధి అవకాశాలపై ఈ నెల 30న ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తామని ప్రతిభ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ వంకా హరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి విద్యార్థికి పదో తరగతి అత్యంత కీలకమన్నారు. తమ లక్ష్యాలు నిర్దేశించుకోవాల్సిన తరుణంలో సరైన విషయ పరిజ్ఞానంతో నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. వివిధ కోర్సుల ప్రవేశ పరీక్షలు రాయడం ద్వారా పోటీ పరీక్షలపై అవగాహన కలుగుతుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ఎన్నికల నియమావళి అమలులో ఉండటంతో అధికారులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. గుంటుపల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్‌ను విజయవాడ వెస్ట్ జోన్ డీసీపీ హరికృష్ణ గురువారం పరిశీలించారు. 65వ నెంబర్ హైవేపై వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న కార్లు, ఇతర వాహనాలను స్వయంగా తనిఖీ చేశారు. నగదు, బంగారం, ఇతర వస్తువులు తమ వాహనాల్లో తీసుకువెళితే తగిన ధ్రువీకరణ పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని వాహనదారులకు సూచించారు. సీఐ ఎం.సత్యనారాయణ, ఎస్‌ఐ పాపారావు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సీఐ ఎం.సత్యనారాయణ అన్నారు. సీపీ టీకే రాణా ఆదేశాల మేరకు కొటికలపూడి గ్రామంలో 100 మంది ఏఆర్, పారామిలటరీ బలగాలతో గురువారం కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఓటర్లు అపోహలు, ప్రలోభాలకు గురికావద్దన్నారు. సక్రమంగా ఓటు హక్కు వినియోగానికి ఎల్లప్పుడూ పోలీస్‌లు రక్షణ కవచంగా నిలుస్తారని చెప్పారు. ఎస్‌ఐ పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



ఆగిరిపల్లి: ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఆర్డీవో భవానీ శంకరి అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అడవి నెక్కలం చెక్ పోస్ట్ వద్ద గురువారం అధికారులు వాహనాలను తనిఖీ చేశారు. ఆర్డీవో భవానీ శంకరి ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సులు, పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్రమంగా నగదు, మద్యం, ఇతర తాయిలాల తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో నగదు తీసుకెళ్లేవారు నిబంధనలు పాటించాలన్నారు. తహసీల్దార్ మృత్యుంజయరావు, ఆర్‌ఐ నవీన్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

చింతలపాడులో మేము సిద్ధం, మా బూత్ సిద్ధం



చింతలపాడులో మేము సిద్ధం, మా బూత్ సిద్ధం కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

తిరువూరురూరల్: మండలంలోని చింతలపాడులో గురువారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మేము సిద్ధం, మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని పలు వార్డుల్లో పార్టీ స్థానిక నాయకులు ఇంటింటికీ వెళ్లి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గత ఐదేళ్లలో గ్రామంలో జరిగిన అభివృద్ధి, మంజూరైన సంక్షేమ పథకాల వివరాలను తెలియజేశారు. జేసీఎస్ మండల కన్వీనర్ గుడిపూడి నారాయణరావు, ఎంపీటీసీ సభ్యురాలు కొంగల సౌమ్య, గ్రామ పార్టీ నాయకులు రవీంద్ర, బాబూరావు పాల్గొన్నారు.

నేడు నూజివీడులో ఎమ్మెల్యే ప్రతాప్ ప్రచారం

నూజివీడు: వైఎస్సార్ సీపీ నూజివీడు నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శుక్రవారం నూజివీడు పట్టణంలోని 13, 14, 15 వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు గురువారం తెలిపాయి. సాయంత్రం ఐదు గంటల నుంచి బాపూనగర్, ఎన్టీఆర్ కాలనీల్లో ప్రచారం నిర్వహిస్తారని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, సానుభూతిపరులు పాల్గొనాలని కోరారు.

ఏఏబీఎస్‌టీఏ దర్బార్‌లో నిత్యాన్నదానం



ఎ.కొండూరు: వేమూరు మండలం జంపని గ్రామంలోని ఏఏబీఎస్‌టీఏ దర్బార్‌లో నిత్యాన్నదానం జరుగుతుందని ఏఏబీఎస్‌టీఏ దర్బార్ పీఠాధిపతి సజ్జాదా అల్ ఖాదరియా అత మహమ్మద్ నిజాముద్దీన్ నిజామీ షా తాజ్ ఖాదరి తెలిపారు. గురువారం చీమలపాడు గ్రామానికి వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గురుదేవులు హుజూర్ హజరత్ సూఫీ ఖ్వాజా మొహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి బాబా వారి ఆశీస్సులతో దర్బార్‌లో నిత్యాన్నదానం నిర్వహిస్తున్నామని చెప్పారు. రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షాపరులతో పాటు కుల మతాలకు అతీతంగా అందరికి అన్నదానం చేస్తున్నామన్నారు. సర్వ మానవాళి శాంతి కోసం, దేశ సమైక్యత కోసం ప్రార్థనలు జరుగుతున్నాయని చెప్పారు. రంజాన్ మాసం ప్రారంభం నుంచి 30 రోజుల పాటు ఉపవాస దీక్షాపరులకు ఇఫ్తార్ విందు ప్రతి రోజు ఏర్పాటు చేస్తున్నామన్నారు. షేక్ కాలేషావలి, షేక్ నాగుల్‌మీరా, జిలాని, గవిని శ్రీధర్, కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



నూజివీడు: మండలంలోని లీలానగర్ జెమ్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ ఆనందరావు గురువారం తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో లీలానగర్ జెమ్ స్కూల్‌కు చెందిన మురాల ప్రశస్త, గోలి లావణ్య, జయంపు లోకేష్ టీమ్ కటాస్ విభాగంలో ప్రథమస్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించారన్నారు. విజేతలను ప్రిన్సిపాల్ ఆనందరావు, కరస్పాండెంట్ జోసఫ్, సిబ్బంది అభినందించారు.

క్రీస్తుమార్గాన్ని అనుసరిస్తే అద్భుత ఫలితాలు

టీవీ వర్తమానికులు రాజేష్‌బాబు



ప్రసంగిస్తున్న పాస్టర్ రాజేష్‌బాబు

చెక్కపల్లి (ముసునూరు): క్రీస్తుమార్గాన్ని అనుసరించే వారు వారి జీవితాలలో అద్భుతాలు చూస్తారని టీవీ వర్తమానికులు, జీసస్ నిస్సీ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు బ్రదర్ రాజేష్‌బాబు అన్నారు. చెక్కపల్లిలోని సెయింట్ పాల్స్ స్కూల్ ప్రాంగణంలో రెండు రోజులుగా జరుగుతున్న అద్భుత ఏసుక్రీస్తు సువార్త మహాసభలు బుధవారం రాత్రితో ముగిశాయి. ఆయన ప్రసంగిస్తూ ఏసుక్రీస్తును నమ్మి ఆయన బోధనలను యథార్థంగా అనుసరించే వారి జీవితాల్లో అద్భుతాలు జరుగుతాయన్నారు. క్రీస్తు రెండవ రాకడకు ముందు జరిగే ఘటనలను విశ్వాసులకు వివరించారు. న్యూ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, సువార్తికులు, ముసునూరు, చాట్రాయి, నూజివీడు, లింగపాలెం, పెదవేగి, చింతలపూడి, ఏలూరు మండలాలకు చెందిన విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన



ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో హైడ్రోజన్ జనరేషన్ ప్లాంట్‌లో ప్రమాదాల నివారణ, మాక్ డ్రిల్‌పై ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజు ఉద్యోగులకు గురువారం అవగాహన కల్పించారు. క్లోరిన్ హైడ్రోజన్, అమోనియా డోజింగ్ చేసే సమయాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. వివిధ విభాగాల విపత్తు స్పందన దళం సభ్యులు అమోనియా లీక్ చేసి విపత్తులను అరికట్టే విధానాన్ని ప్రదర్శన ద్వారా వివరించారు. ఎలక్ట్రికల్, అమోనియా, గ్యాస్ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పలువురు సీనియర్, జూనియర్ ఇంజినీర్లు, వివిధ విభాగాల రక్షణదళం సభ్యులు పాల్గొన్నారు.

మిట్టగూడెంలో రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన



రామాలయ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: మండలంలోని మిట్టగూడెంలో శ్రీ నవ ఆంజనేయ సహిత సీతారామ ఆలయ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ గ్రామ పెద్దలు వెలివల నాగేశ్వరరావు, స్థల దాతలు మిర్యాల రామ్‌కుమార్, మిర్యాల కిషోర్, గెల్లా కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, తపన ఫౌండేషన్ చైర్మన్ తపన చౌదరి, పాటల రచయిత అనంత శ్రీరామ్ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, సర్పంచ్ కొనకాల నరసింహారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

1న వికాస్‌లో ప్రాంగణ ఎంపికలు

విస్సన్నపేట: ప్రముఖ బహుళజాతి ఔషధ సంస్థ ఎంఎస్ఎన్ ల్యాబ్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఏప్రిల్ ఒకటో తేదీన స్థానిక వికాస్ పీజీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తామని కళాశాల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి గురువారం తెలిపారు. ఈ ఎంపికలకు ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎనలిటికల్ కెమిస్ట్రీ, బి ఫార్మసీ, ఎం ఫార్మసీ చేసిన విద్యార్థులు అర్హులన్నారు. వివరాలకు కళాశాల ప్రిన్సిపాల్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ చల్లా సుధీర్‌రెడ్డిని సంప్రదించాలన్నారు.

నేడు కొండపల్లిలో తిరుపతిరావు పర్యటన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు శుక్రవారం కొండపల్లిలో పర్యటిస్తారని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య గురువారం తెలిపారు. మున్సిపాలిటీ కౌన్సిలర్లు, పార్టీకి చెందిన వివిధ విభాగాల నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ అమ్మవారి చిన తిరునాళ్ల నాలుగోరోజు గురువారం ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు మునేరులో స్నానాలు చేసి పాలు, పొంగళ్లతో అమ్మవారిని దర్శించుకొని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయ క్యూలైన్లతో పాటు పరిసరాలు భక్తులతో కిక్కిరిశాయి. అమ్మవారి పుట్టినిల్లు అనిగండ్లపాడుతో పాటు మండలంలోని ముచ్చింతాల, వెంకటాపురం, గుమ్మడిదూర్రు, శివాపురం గ్రామాల నుంచి చిన్న దూడలు, గొర్రెలతో బండ్లు కట్టడంతోపాటు సైకిళ్లకు, ఆటోలకు ప్రభలు కట్టి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మునేరులో పెద్దఎత్తున గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. భక్తులకు రామ్‌కో సిమెంట్స్ వారు పులిహోర ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె. రమేష్‌నాయుడు, రామ్‌కో సిమెంట్స్ ప్రెసిడెంట్ ఆశిష్‌కుమార్ శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు. భక్తులు రాత్రి సమయంలో ఆలయ ప్రాంగణంలో సేద తీరారు. ఎగ్జిబిషన్ వద్ద భక్తుల కోలాహలం కనిపించింది.

అక్రమ మద్యం విక్రయదారుడి అరెస్ట్

ముసునూరు: అక్రమంగా మద్యం తరలిస్తున్నాడనే సమాచారంతో దాడులు నిర్వహించి మద్యం తరలిస్తున్న వ్యక్తిని గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం.. సూరేపల్లికి చెందిన కొరివి నాగరాజు (22) ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి 49 మద్యం బాటిల్స్‌ను అక్రమంగా తరలిస్తుండగా దాడిచేసి అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 49 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని నూజివీడు కోర్టుకు హాజరుపరుస్తారు.

వెంకటాయపాలెంలో వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ



వెంకటాయపాలెంలో రామాలయం ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న చిన జీయర్ స్వామి

నూజివీడు: మండలంలోని వెంకటాయపాలెంలో రామచంద్రస్వామి వారి నూతన ఆలయ, విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, మహాకుంభ సంప్రోక్షణ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పాల్గొన్నారు. ఉదయం 7 గంటల నుంచి వేద పండితుల మంత్రోచ్చరణ నడుమ ప్రతిష్ఠా కార్యక్రమాలను వైష్ణవ ఆగమ సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు.

ప్రజలు, భక్తులు ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

మైలవరం: రక్త దాతలందరూ ప్రాణదాతలేనని, రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రవి మాట్లాడుతూ రక్తం దానం చేయడం ద్వారా ఒక నిండు ప్రాణాన్ని కాపాడటంతోపాటు ఆ కుటుంబానికి రక్షణగా నిలిచిన వారమవుతామని చెప్పారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి డాక్టర్ రమణారావు మాట్లాడుతూ రక్త దానానికి అర్హత కలిగిన యువతీ యువకులు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని చెప్పారు. కళాశాల యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ మన్నే స్వామి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వి. ఫణికుమార్, రెడ్ క్రాస్ మైలవరం బ్రాంచ్ సెక్రటరీ జి. నాగిరెడ్డి పాల్గొన్నారు.

కనుల విందుగా పుష్పయాగం



నెమలిలో స్వామికి పుష్పయాగం

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం పవళింపు సేవతో ముగిశాయి. ఉదయం ఐదు గంటలకు సుప్రభాత సేవతో ప్రత్యేక కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు, అర్చక బృందం చేపట్టారు. వేణుగోపాల స్వామి, రుక్మిణీదేవి, సత్యభామ అమ్మవార్ల ధ్రువ మూర్తులకు పంచామృతాలతో అభిషేకం చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం నిర్వహించిన పుష్పయాగం భక్తులకు కనువిందు చేసింది. వివిధ రకాల పుష్పాలతో స్వామికి అర్చన జరిపారు. వేడుకల్లో భాగంగా ద్వాదశి ప్రదక్షిణలు (12 సేవలు) భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేణుగోపాల స్వామి, రుక్మిణీదేవి సత్యభామ ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి భక్తులు మోసుకుంటూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, సహాయ కమిషనర్ నూతక్కి వెంకట సాంబశివరావు, పాలకవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

చాట్రాయి: చిన్నంపేట గ్రామంలో గేదెలు పొడుచుకుని ద్విచక్ర వాహనంపై పడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన తొమ్మండ్రు కృష్ణ భార్య తొమ్మండ్రు దేవమాత కలిసి బుధవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఏలూరులో బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మండలంలోని ఎర్రవారిగూడెం వద్ద ఎదురుగా వస్తున్న గేదెలు ఒక దానినొకటి పొడుచుకుని ద్విచక్ర వాహనంపై పడడంతో కృష్ణకి కుడి కాలు, భార్యకు కుడి చేయి విరిగాయి. గ్రామస్తులు వారిని ఆటోలో వలసపల్లి అడ్డరోడ్డుకి తరలించారు. అక్కడి నుంచి 108 వాహనంలో ఏలూరు ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

జూదరుల అరెస్ట్

ముసునూరు: మండలంలోని చెక్కపల్లిలో పేకాట శిబిరంపై దాడి చేసి, నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం.. అందిన సమాచారం ప్రకారం గురువారం రాత్రి పేకాట శిబిరంపై ఎస్‌ఐ సిబ్బందితో కలిసి దాడి చేశారు. నలుగురిని అదుపులోనికి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,110 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను నూజివీడు కోర్టుకు తరలించనున్నారు.